దసరా బహుమతి

శ్రీమతి సమయమంత్రి వందేమాతరంగారు

దసరా పండుగలకు పదిరోజులు ముందుగనే యల్లుర నాహ్వానించుట కేగినారు ప్రసాదరావుగారు. ఊపిరివిడువనైన తీరిక లేకుండ పనులుచేయుచున్నారు మంగళాంబగారు. ఈ యుత్తమామల యుడావుడికి అన్యదేశాలనుంచి విద్య పూర్తిచేసి వచ్చిన గోపాలవర్మరాకయే కారణం. వివాహమైన సంవత్సర మేపండుగ కొచ్చినాడో, మరి రానేలేదు వర్మ. మూడవయల్లునితో పాటు తతిమ్మా యిరువురనూకూడా పిలువదల్చా రాయన ప్రసాదరావుగారు—వచ్చేటప్పుడే కుమార్తెలను పిల్చుకొచ్చేశారు. ఆతల్లీ కూతుండ్లేమియువస్తపడుచున్నారో కాని వనసుందరి కీ సంగతులేం పట్టడంలేదు. తన చదువేమో తనేమో అంతే; అదీగాక యీ యేటితో చదువు మానివేయాలెగావల్సని గొప్ప వేదన పుట్టి ఆ లేతహృదయాన్ని బాధిస్తున్నదిపాపం. సుందరి జగదేకసుందరి. సుగుణాలవాల; పదునారేడుల ప్రాయము; చక్కని శరీరకాంతి; నల్లటినొక్కు నొక్కుల కేశములు; నిరంతర ఖద్దరువస్త్రధారిణి. యిక నామె చక్కదనమునకు లోటేమి కలదు? గోపాలవర్మ విద్య పూర్తిచేసిరాగానే నిషేకముహూర్తము కానీయమని యాతని మాతాపితరులు ప్రసాదరావుగార్ని కోరినారు. "ఈయేటిపరీక్షలుకాగానే మీయిష్టము నెరవేర్పగలను. అంతదనుక యోపికపట్టు" డని కోరగ వారందులకు సమ్మతించేరు. ముఖ్యంగా వర్మయే తన సమ్మతిని చూపేడు. ఆశ్వయుజ శుద్ధపాడ్యమినాడే సుందరీ చెల్లెలూ బొమ్మలు పెట్టుకున్నారు. మహార్నవమికి రెండురోజులు ముందుగనే గోపాల వర్మ వచ్చేడు. అల్లునకు జరుగవలసిన మర్యాదలన్నీ జరుగుతున్నయి, కాని సుందరి దరిశనభాగ్య మతనికింతవరకు కానేలేదు. 'ఛీ సుద్ధమొద్దులా గీలా దాగుండడ మేమిటిః? నాన్ సెన్సు!!'అని విసుగుచెందుతుండేవాడు. 'యేమో ఒకవేళ అవుపడినా గుర్తించ లేకుండా వున్నానేమో' యనుకొనేవాడు. మహార్నవమినాడందరూ తలయంట్లు పోసికొనిరి. హడావుడిగ కొత్తలాగు చొక్కాల కోసరం సుందరితమ్ముడు సోమశేఖరం అల్లరిపెట్టేస్తున్నాడు. 'వుండరా బాబూ, కాఫీ త్రాగి యిస్తా'నంది సుందరి. 'అప్పుడే నాబడి పిల్లలంతా గిలకబద్దలుపట్టుకొని వెళ్లుంటారు: మరినేనో'యని ఏడ్పుముఖమేశాడు. ముందు వాడిపని చూడమని తల్లియనుటచే సుంటిరి ఆలాగేయన్నది; తమ్మున కలంకరించి విల్లు బద్దచేతికిచ్చి దానికొననున్న సంచినిండ బుక్కానింపి యీబాల వసంతమూర్తి నొకపరి ముద్దిడికొని యుక్తాయుక్తపరిజ్ఞాన విహీనుడగు మారునివలెగాక జాగ్రత్తగ మెలంగిరమ్మని సోదరు నెచ్చరించి పంపినది. మధుర పదార్థములగు పిండివంటకములతో

సహభోజనము లారగించి యెచ్చటివా రచ్చట విశ్రమించారు. కపురంపు వీడెముల నములుచు సుమారు మూడుగంటలప్పుడు మండువా సావడిలో వాల్లుర్చీలో పరున్నాడు ఎదపై దసరాగృహలక్ష్మి నిడికొని వర్మ. ప్రక్కగది తలుపు కిర్ మని శబ్దముచేసరికి కండ్లువిప్పి యటుత్రిప్పేడు ముఖం. దువ్వుకొనుచున్న తలనట్టే వేలుముడివైచికొని నోవ్యక్తి యీవలకు రావటం చూచేడు. ప్రక్కనుంచాలా వెళ్తుంటే సుందరేయనుకొని తదేకదీక్షగా చూడసాగేడామెని. నాసుందరీలా అయిపోయిందేమిచెప్మా అనుకొంటూంటే 'అమ్మా, నా కొత్తతోక్కి యియ్యవుతే అని యేడుస్తూ వెళ్తున్న చిట్టి పంతుల్ని చూచి పడిన పొరబాటుకు పశ్చాత్తాపపడి పత్రిక చేతికి తీసుకొని చదువసాగేడు వర్మ. ఈలాంటి పొరబాటు సాధారణంగా ఆయింట్లో అంతాపడుతూనేయుంటారు. సుందరిలోనూ ఆమె చిన్నక్క శ్యామలలోనూ యేకొద్ది వ్యత్యాసమోకాని లేదు; మూడుమూర్తులా నొకరినొకరు పోలియేయుండురు. సంతానవతయాక శ్యామల బాగా మారిపోయింది. తేలిపోతున్నకళ్లు యుస్సురను వేడినిట్టూర్పులు బక్కపలుచటి శరీరము వీనింబట్టి శ్యామలాసుందరుల కనుగొనవచ్చు. ఆలాంటప్పుడు యేనాడో వివాహమప్పుడు చూచియున్న భార్య నేలా గుర్తింపగలడు వర్మ? ఆమె రూపు రేఖాదులుమాత్ర మతని హృదయంలో హత్తుకుపోయే యున్నయి. ఎన్నిదేశాలు తిరిగినా ఆబింబాన్నిమాత్రమతను దుడిచివేయలేదు. పాపం విజయదశమినాడు మధ్యాహ్నం ప్రసాదరావుగారు యల్లుండ్రతోమాటలాడుచు కూర్చున్నారు. వీథులన్నీ ప్రతిధ్వనించేట్లు గిలకలపద్యాలు పాడుకొంటూ నూతనవస్త్రాలంకృతులై కలియుగ మన్మథమూర్తులంబోలె బయలుదేరేరు విల్లమ్ములు ధరియించి ముందుబడి పంతులు వెనుక పిల్లలు ప్రసాదరావుగారింట ప్రవేశించారు 'శ్రీరస్తు విజయోస్తు దిగ్విజయమస్తు; స్వస్తివాచకమస్తు మీకు శుభమస్తు' అని మొదలెట్టి యిల్లెగిరిపోయేట్లు పాడేస్తున్నారు పిల్లలు. అయ్యవారికిచాలు నైదు వరహాలు; పిల్లవాండ్లకుచాలు పప్పుబెల్లాలు. అని పాడు నప్పుడు యేదీ మళ్లీ అనంద్రా ఆ మొదటిముక్క అని ఆజ్ఞాపించాడు పంతులు వాళ్లని. ద్వారబంధాన్నానుకొని నిలబడి కుమారునిచూచి మురుసుకొనుచున్న మంగళాంబగారి చెవులకు యేం పంతులుగారి బహుమతి యీలాపంపించు అని ప్రసాదరావుగారనుట వినుపింప తెచ్చుచున్నానండీయని లోనికేగి తాంబూలమూ పంచెలచాపూ తెచ్చి భర్తకందిచ్చిందామె. 'నాయనా, గురువుగార్ని పూజించి యీ బహుమతుల నిప్పుమని కుమారుని ప్రబోధించారు ప్రసాదరావుగారు. తండ్రి చెప్పినప్రకారం చేశాడు శేఖరం. రూపాయలు రొంటిని పెట్టుకుంటూ పంతులుగా రీయేడు చాలా చిన్నచూపుచూచేరు అన్నాడుబుడిపంతులు. ఆలాగే ఁటుంటారుకడకు మీకుచేసినలోటేమిటండి మంగళాంబ కొద్ది తీక్షణస్వరంతో మీబోటివార్ని గాక మరెవర్నడుగుతాం

తల్లీ మేం అన్నా డాయన. ఆ అడగటాని కేనా వీలూచాలూ వుండొద్దా అన్నదామె. శాస్త్రీలుగారూ? మీరడుగనూవచ్చు మే మీయనూవచ్చు కాని మీరింకా శ్రద్ధగా పట్టుదలగా చదువుచెప్పాలి పిల్లలకు; లేకుంటే యీ వింటిబద్దలరూల్సు యెత్తివేయిస్తా నేమనుకున్నారో అన్నారు ప్రసాదరావుగారు. చిత్తం — తమశెలవుప్రకారం నడుచుకొంటానన్నాడు శాస్త్రీలు. శ్యామలొక పళ్లెంనిండా లడ్లు మరొకపళ్లెంనిండా పప్పుబెల్లాలూ తెచ్చి పిల్లలకు పంచిపెట్టేరు. తిని చేతులు కడిగికొని విల్లులు చేతధరించి రెండు చరణాలుపాడి గిలకలందున్న పూలసంద రొక్కమారుగ నందాసీనులై యున్న మామ యల్లుండ్రపై చల్లి గలగలలాడుచు నావలికేగిరి. గిలకనిండా బుక్కా యెక్కించి బావముఖానికి సూటిజూచి నారిని విడిచిపెట్టేడు శేఖరం. అదేమిపనిరా శేఖరా? బావకు కోపంరాదా యన్నది మంగళాంబగారు. యీచిన్నితమాషా కేమికోపమమ్మా యంటూ తోటిబాలుర గలసికొన పరువిడినాడు. చేరుమాలుచే కండ్లుదుడిచికొనుచు నోటబడినవాని నుమియుచు లోనికొచ్చేడు వర్మ. మరిదిగారికి తగిన బహుమతియే జరిగినదేయంటూ లేచి నిలబడ్డారు రమణాశ్యామలలు. అచ్చటనేకూర్చొని తఖలిమీద ధారంతీయుచున్న వనసుందరి చిరునవ్వు మోమున చిందులాడ లేచి వెళ్లిపోయింది. సుందరి చదువుకొనుచు మేడమీద గదిలో సోపాలో పరున్నది. ఏమియూ దోచక సందెపిల్లతెమ్మెరలనైన ననుభవించి సుఖింప నెంచి గోపాలవర్మకూడ పైకివెడలి డాబా చేపట్టుగోడపై నాసీనుడైనాడు. ప్రకృతివైచిత్ర్యము నీక్షించుచుండ చెంతగల గది నుండి సన్నటి కంఠధ్వని వీనులవార నిండె వరుగలరో చూచివచ్చెదగాక యని పద శబ్దమేనిగాకుండ గదిద్వారము చెంతకేగి యందు పాఠములం చదువుకొనుచున్న సుందరింగని ఆ సౌందర్యమధువును మన సారగ్రోలుచు నిలువంబడియెను. తదేక దీక్షగ జదువుకొనుచున్న సుందరి యిదేమి గాంచనేలేదు. సుందరీ? ఓ సుందరీ? కను చీకటి వేళ నెచ్చటికేగితివమ్మా యను మాతృనుడులు వీనులవార నులికిపడిలేచి వచ్చుచుంటినమ్మా? యని పుస్తకముల జాగ్రతపెట్టి యీవలకు రా మొదలిడెను. ఆమె కగుపడకుండగనే కొలది ప్రక్కకొత్తిగిలినాడు వర్మ? చరచర నామెయూ ద్వారము సమీపించి దాటనుండ గోపాల వర్మ యెదురేగి యడ్డుగ నిలచినాడు రెండు చేతులూ ద్వారము నాన్చి. ఖంగారుగ రెండడుగు లవతలకేసి, అబ్బా? యెవరూ? అన్నది అస్ఫుటస్వరముతో? యిన్నిరోజులు కనుపింపకుండ దాక్కొన్నావు యిప్పుడేం చేస్తావన్నట్టు తలవంచియున్న ఆమె కళ్లల్లోకి చూచాడువంగి వర్మ. చూచారా? అవతల యమ్మ పిల్చుచుండ మీరే యీలా మార్గ మడ్డగిస్తే యేలాయన్నట్టుదీనంగా చూచింది భర్త ముఖంకేసి. వృథాగా నామెను నవ్వుల పాలెందుకు చేయడమనో, స్వతస్సిద్ధంగా దయార్ద్రహృదయుడగుట చేతనో, చేతులడ్డం తీసేసి ఆమె చెంపపై

సతి నాజూకుగ నొక్కటికొట్టేను దసరా బహుమతియని. యిక వెళ్లు పాపం అన్నాడు. చెంప తడుముకొంటూ వెళ్తూ వెళ్తూ పై మెట్టుమీద నిలబడి ఒక్కమారు వెనుదిరిగి చూచి నవ్వుకుంటూ చెక చెక మెట్లుదిగి పోయింది సుందరి. మామగారిచ్చిన పండుగ కానుకలందికొని సంతృప్తహృదయులై యత్తమామల యాశీర్వాదములందికొని వారివారి నివాసముల జేర నేగిరి యల్లుండ్రందరును. తోటి సహవాసగత్తెలం జేరి వేళ మించకుండగ పాఠశాలకేగి విద్య నభ్యసించుచున్నది వనసుందరి. తీరికకలిగినపుడెల్ల భర్తయొసంగిన దసరా బహుమతి తల్చుకుంటూ.

దైవభక్తి

శ్రీమతి, కొల్లూరి. గౌరీదేవిగారు

౧

ఉ॥ రాలకు మ్రొక్కినంతనె పరాత్పరు డుండునటంచు నెంచి, దే
వాలయమందు భక్తులయినంత, వనాంతరమందు పుట్టలన్
పాలనుబోసినంత, నదిమధ్యమునందు మునింగినంత పా
పాలను బాసిపోదురె? కృపారహితాత్ములు జారచోరులున్.

౨

ఉ॥ ఇమ్మహినర్థగర్వమున నెందరొ యశోవనమందు చాలనే
రమ్ములుచేసి తామిహపరంబుల ముక్తినిబొందగోరి పా
పమ్ములు వోవగా జపతపమ్ములు చేతురు వృద్ధులైనకా
లమ్మున రామనామము విరామములేక జపింతురారకన్.

౩

ఉ॥ సోదరులందఱున్ గలసి సొంపుగనుండిన వారితండ్రికా
మోదముగాదె చేతమున; భూప్రజకంతకు తండ్రియంచు దా
మోదరు నెంచి చెప్పరె ప్రబుద్ధులు; కావున తోడివారిక
త్యాదరమిచ్చి జూచునపుడార్తశరణ్యుడు సంతసింపడే?